





సకల సిద్ధి ప్రాప్తిరస్తు..!

- జిల్లా వ్యాప్తంగా మొదలైన సందడి
- నేడు వినాయక చవితి



కర్నూలు కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విఘ్నాలు తొలగి శుభాలు అందించే వినాయకుడి వేడుకలకు జిల్లా సిద్ధమైంది. 'వినాయక చవితి'ని బుధవారం ఉమ్మడి జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ ఏడాది వినాయక చవితి పండుగ సందడి బాగా కానవస్తోంది. ఈ వేడుక సందర్భంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే 'గణేశ్ నవరాత్రి మహోత్సవాలు' వాడవాడలా అంగరంగ వైభవంగా ఆరంభించేందుకు నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా పట్టణాలు, గ్రామాల్లో గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు భారీ వినాయక ప్రతిమలు నెలకొల్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ వాడలు, పట్టణ ప్రాంతాల్లోని వీధుల్లో, నాలుగు రోడ్ల కూడళ్లు, చౌరస్తాలలో గణేశ్ మంటపాల్లో నెలకొల్పిన విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి. 'నవరాత్రి ఉత్సవాలు' సంబరంగా నిర్వహించేందుకు కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయక చవితి సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని మార్కెట్లు కళకళలాడాయి. గృహాల్లో వినాయక ప్రతిమలు నెలకొల్పి పూజించే వారు చిన్న చిన్న వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి, పత్రి, పూలు, పండ్లు కొనుగోళ్లకు రావడంతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన వీధులన్నీ కిటకిటలాడాయి. గ్రామీణ ప్రాంతాల్లో లభించే గరిక, జిల్లేడు, గన్నేరు తదితర పూలను పట్టణ ప్రాంతాలకు తీసుకువచ్చి అమ్మకాలకు పెట్టారు. కొబ్బరి మట్టలు, వెలగకాయలు, సీతాఫలం, అరటి బోదెలు, కంకులు, చెరకు గడలు వంటి వాటికి గిరాకీ ఏర్పడింది. ఈ క్రమంలో బంతిపూలు రూ.140 నుంచి రూ.250 వరకు ధరలు పలికాయి. చెరకు గడలు, వెలగకాయలు, జిల్లేడు, మారేడు, రావి, గరిక పత్రాలకు డిమాండ్ ఏర్పడింది. మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, అరటి బోదెలు కూడా అధిక ధరలు పలికాయి.

మకాం మార్చాల్సిందే..!

- ఆర్అండ్‌బీ క్వార్టర్స్ ఖాళీ చేయాల్సిందే
- అద్దెలకు ఇచ్చి జేబులు నింపుకున్న బినామీలు
- నివాసాల్లో ఉన్న అక్రమార్కులకు నోటీసులు
- సెప్టెంబరు 7వ తేదీ వరకే గడువు
- నీరు, విద్యుత్ కట్ చేయాలని కలెక్టర్ ఆదేశం

ప్రభుత్వ ఉద్యోగులకు క్వార్టర్స్‌ను కేటాయిస్తారు. ఆర్అండ్‌బీ క్వార్టర్స్‌లో ఏళ్ల తరబడి అక్రమార్కులు పాగా వేశారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ, నగరపాలక సంస్థల సంయుక్త పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు ఇంతకాలం రెచ్చిపోయారు. ఏ, బీ, సీ క్యాంప్‌ల పేరుతో ఉన్న సుమారు వెయ్యికి పైగా ప్రభుత్వ భవనాలు దుర్వినియోగం అవుతూ వచ్చాయి. సెప్టెంబర్ 7వ తేదీ లోపు ఖాళీ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఖాళీ చేసి వాటిని వెంటనే మరమ్మతులు చేయించేందుకు అవసరమైన ప్రణాళికలతో రూపొందించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. అక్రమ నివాసాల్లో ఉన్నవారికి నీరు, విద్యుత్ సరఫరా వేంటనే నిలిపి వేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



ఆర్అండ్‌బీ క్వార్టర్స్

కర్నూలు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ క్వార్టర్స్‌లో ఏళ్ల తరబడి అక్రమార్కులు పాగా వేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా మారిందన్న ఫిర్యాదులను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. రెవెన్యూ విభాగంలోని కొందరు ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల అనుచరులు మకాం వేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో వారే ఏళ్ల తరబడి వారి ఆధీనంలోకి వెళ్లాయి. కొందరు అద్దెలకు ఇచ్చి ప్రభుత్వ భవనాలను దుర్వినియోగం చేస్తున్నారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ, నగరపాలక సంస్థల సంయుక్త పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు ఇంత కాలం రెచ్చిపోయారు. ఇంతా కాలం ప్రశ్నించే వారు లేక పోవడంతో ఏ, బీ, సీ క్యాంప్‌ల పేరుతో ఉన్న సుమారు వెయ్యికి పైగా ప్రభుత్వ భవనాలు దుర్వినియోగం అవుతూ వచ్చాయి.

91ఎకరాల్లో 1072 క్వార్టర్లు

1953-1956లో 91 ఎకరాల విస్తీర్ణంలో 1072 క్వార్టర్లు నిర్మించారు. ఏ, బీ, సీ క్యాంపుల్లో ఏ176, బీ 634, సీ 103, డీ 51, ఈ 10, ఎంఐజీ 5 పేర్లతో క్వార్టర్స్ ఉన్నాయి. అంతేకాకుండా ఫారెస్ట్, ఫిషరీస్ కాంపౌండ్‌లలో టైపు 40, బీ టైపు 14, సీ టైపు 6, ఈ టైపు రెండు, ఎఫ్ టైపు ఒకటి ఉన్నాయి. 68 క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి.

మరమ్మతులు శూన్యం..

క్వార్టర్స్‌లో నివాసాలు ఉంటున్న ఉద్యోగుల నుంచి హెచ్‌ఆర్‌ఏ కింద వేతనాల్లో కోత విధిస్తున్న సొమ్మును రెవెన్యూ శాఖ ఖజానాకు జమచేస్తుంది. కానీ మరమ్మతులకు సంబంధించి పట్టించుకోకపోవడంతో పలు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

క్వార్టర్స్ ఇలా..

ఏ, బీ, సీ క్వార్టర్స్‌లో రెవెన్యూ ఉద్యోగి కబ్జాలో 14ఇళ్లు, మరో రిటైర్డ్ ఉద్యోగి చేతిలో 18 ఇళ్లు, వైసీపీకి చెందిన ఓ మహిళా నేత, మరో ఇద్దరు అనుచరుల చేతుల్లో మరో 60 ఇళ్లు, కుల సంఘాలు, ఇతర అసోసియేషన్ల పేరుతో మరో 80ఇళ్లలో కొందరు అక్రమంగా నివాసాలు ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. బినామీలు ఇళ్లను అద్దెకు ఇచ్చి నెలానెలా అద్దెల రూపంలో జేబులు నింపుకుంటున్నారు.

ఆరు నెలలుగా సాగిన సర్వేలు

రెవెన్యూ, అర్ అండ్‌బీ, నగర పాలక సంస్థ, విద్యుత్ శాఖ, పోలీసులు సంయుక్తంగా సర్వేలు నిర్వహించారు. 496 క్వార్టర్లలో అక్రమంగా నివాసం ఉంటున్నారని నివేదికను కలెక్టర్‌కు నివేదించారు. స్పందించిన కలెక్టర్ ఇటీవల జిల్లా అధికారులతో సమీక్షించి అందులో ఉన్నవారిని సెప్టెంబరు 7వ తేదీలోపు ఖాళీ చేయించాలని ఆదేశించారు. ఆపై 8వ తేదీ నుంచి మూడు బృందాలుగా ఏర్పడి అక్రమంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని, తదుపరి భవనాలను రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పోలీసు పర్యవేక్షణలో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఖాళీ చేసి వాటిని వెంటనే మరమ్మతులు చేయించేందుకు అవసరమైన ప్రణాళికలతో రూపొందించి నివేదిక ఇవ్వాలని సూచించినట్లు అధికారులు చెబుతున్నారు. అక్రమ నివాసాల్లో ఉన్నవారికి నీరు, విద్యుత్ సరఫరా వెంటనే నిలిపివేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



అరకొర వసతులు

క్వార్టర్స్‌లోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు సౌకర్యాలు నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తుంది. ఆశాఖ పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో కొద్దిపాటి వర్షం వస్తే వర్షపు నీరు మురుగు నీరు కాంపౌండ్‌లో నిలిచిపోతుంది. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా క్వార్టర్స్‌లో ఉన్నవారు తరచూ రోగాలబారిన పడుతున్నారు. దీనికి తోడు పిచ్చిమొక్కలు పెరగడం విషపురుగులు చేరుతున్నాయి. 1953లో మద్రాస్ టెర్రస్ రూఫ్‌తో నిర్మించబడ్డ క్వార్టర్లు వర్షం వస్తే కారుతున్నాయి. కింది ఫ్లోరింగ్ కూడా దెబ్బతిన్నాయి. సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని నివాసాల్లో ఉంటున్న కొందరు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.



సహకరించండి

అక్రమంగా నివాసం ఉంటున్న వారు సహకరించాలి. సెప్టెంబరు 7వ తేదీ లోపు ప్రభుత్వ క్వార్టర్స్ ఖాళీ చేయాలి. 8వ తేదీ మూడు బృందాలుగా ఏర్పడి అధికారులు, ఉద్యోగులు నివాసాల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయిస్తాం. ఆలోపే అక్రమ నివాసాల్లో ఉన్నవారు సహకరించాలి. ప్రభుత్వ లక్ష్యం మేరకు వాటిని ఉపయోగించేందుకు కలెక్టర్ ఆదేశించారు. అక్రమంగా నివాసాలు ఉంటున్న వారిని ఖాళీచేయిస్తాం.

- పి. మహేశ్వరరెడ్డి, ఎస్ఈ, ఆర్అండ్‌బీ



సర్వజన వైద్యశాల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- జీజీహెచ్‌లో రూ.6.74 కోట్లతో సిటీ స్కాన్ ప్రారంభం



కొత్త సిటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు హస్పిటల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పవర్ గ్రిడ్ సంస్థ రూ.6.74 కోట్లతో అందజేసిన 128 స్లైస్ సిటీ మిషన్‌ను మంగళవారం సాయంత్రం మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సిటీ స్కాన్ మిషన్‌ను కర్నూలు జీజీహెచ్‌కు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. మొదటి నుంచి నియోజకవర్గ అభివృద్ధి, సర్వజన వైద్యశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు.

ఆక్సిజన్‌కు రూ.కోట్లు పోతున్నాయ్..

కర్నూలు జీజీహెచ్‌లో ఆక్సిజన్ సరఫరా చేస్తున్న ఏజెన్సీకి రూ.కోట్లు పోతున్నాయని మంత్రి టీజీ భరత్ అన్నారు. రాష్ట్రమంతటా ప్రభుత్వ ఆసుపత్రులకు లిక్విడ్ ఆక్సిజన్ సరఫరాకు క్యూబిక్ మీటర్‌కు రూ.38 చేస్తున్నారని, అదే కర్నూలు జీజీహెచ్‌కి కూడా సరఫరా చేస్తోందని, ఏజెన్సీపై తాను ఫిర్యాదు చేశానని తెలిపారు. తమ సొంత ఆసుపత్రిలో కేవలం ఆక్సిజన్ సరఫరాకు క్యూబిక్ మీటర్‌కు కేవలం రూ.12చొప్పున సరఫరా అవుతోందన్నారు. కర్నూలు జీజీహెచ్‌కే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయలు పోతున్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు, రుజువులతో ఫిర్యాదు చేశానన్నారు. తక్షణమే ఆక్సిజన్ కాంట్రాక్టును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం శ్రీనివాసమూర్తి, పీఆర్వో శ్రీకాంత్, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ కృష్ణ ప్రకాష్ పాల్గొన్నారు.

ఆ ముగ్గురు!

- టీడీపీ జిల్లా అధ్యక్ష స్థానానికి మూడు పేర్లు సిఫార్సు
- తుది నిర్ణయం అధినేత చంద్రబాబుదే
- ముగిసిన త్రీమెన్ కమిటీ సమావేశం
- హాజరైన మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి

కర్నూలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అధ్యక్ష స్థానానికి భారీ పోటీ నడుమ మూడు పేర్లు అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కర్నూలు జిల్లా కేంద్రంలో మంగళవారం టీడీపీ నియమించిన 'త్రీమెన్ కమిటీ' పర్యటించింది. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి త్రీమెన్ కమిటీ సభ్యులుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, అనుబంధ సంఘాల ఎంపికపై త్రిసభ్య కమిటీ సభ్యులు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి అభిప్రాయాలను తీసుకున్నారు. ముందుగా పార్టీ అధ్యక్ష స్థానానికి పి.తిక్కారెడ్డి, నాయకులు నాగరాజుయాదవ్, వహీద్ హుస్సేన్, కేఈ జగదీశ్ గౌడ్, మహిళా నేత అరుణ కుమారి దరఖాస్తు చేశారు. అనంతరం టీడీపీ కీలక నేతలను ఒక్కొక్కరిగా పిలిపించి అభిప్రాయాలు తీసుకున్నారు. ముఖ్య నాయకుల అభిప్రాయం మేరకు ముగ్గురు పేర్లను అధిష్ఠానానికి పంపించారు. ఈ క్రమంలో జిల్లా అధ్యక్ష స్థానానికి పి.తిక్కారెడ్డి, కేఈ జగదీశ్ గౌడ్, నాగరాజు యాదవ్ పేర్లను పార్టీ అధిష్ఠానానికి సిఫార్సు చేసినట్లు సమాచారం. ఆ ముగ్గురిలో చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

అనుబంధ సంఘాల అధ్యక్షులపై చర్చ

తెలుగుమహిళా, తెలుగు విద్యార్థి, తెలుగు రైతు, టీఎన్‌టీయూసీ.. ఇలా టీడీపీ అనుబంధ సంఘాలు 18 ఉన్నాయి. ఆ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపికపై కూడా చర్చ జరిగింది. వాస్తవంగా పార్టీ అధ్యక్షుడితో పాటు అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపికపై కూడా త్రీమెన్ కమిటీ ముఖ్య నాయకుల అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంది. అయితే పార్టీ అధ్యక్షుడి ఎంపికపైనే అభిప్రాయాల సేకరణలో సమయం గడిచిపోయింది. దీంతో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే ఒక్కో నియోజకవర్గానికి రెండు అనుబంధ సంఘాలు కేటాయించి, ఆ మేరకు పేర్లు సిఫార్సు చేయమని ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలకు త్రీమెన్ కమిటీ సభ్యులు సూచించినట్లు తెలిసింది. కాగా తెలుగు మహిళా అధ్యక్ష పీఠం కోసం కార్పొరేటర్ పద్మజారెడ్డి, ప్రస్తుత అధ్యక్షురాలు ముంతాజ్‌బేగంలు ఆశిస్తున్నారు. తెలుగు యువత అధ్యక్ష పీఠం కోసం కర్నూలు నగరానికి చెందిన అబ్బాస్, రాజు ఆశిస్తున్నారు.

ఈ కీలక సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం, పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, వాల్మీకి, కరువ కార్పొరేషన్ల చైర్మన్లు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాన్వి దేవేంద్రప్ప, ఆదోని, మంత్రాలయం, ఆలూరు నేతలు కె.మీనాక్షినాయుడు, రాఘవేంద్రరెడ్డి, వీరభద్రగౌడ్, మాజీ ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్ తదితరులు హాజరయ్యారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌కు నేడే చివరి తేదీ

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 27వ తేదీ చివరి తేదీ అని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అర్హత కలిగిన విద్యార్థులు జవహర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. వివరాలకు జవహర్ నవోదయ విద్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

హోంగార్డు కుటుంబానికి బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్

నంద్యాల టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డు మాలిక్ రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబానికి రూ.38లక్షల ప్రమాద బీమా చెక్కును వారి ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డుకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండడంతో శాలరీ ప్యాకేజీ కింద యాక్సిస్ బ్యాంకు వారు రూ.30లక్షలు, హోంగార్డు కూతురు మైనర్ కావడంతో మరో రూ.8లక్షలు కలిపి 38 లక్షలు అందజేశామన్నారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలని కోరారు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఇలాంటి ప్రయోజనాలతో కుటుంబానికి కొంత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, డీఎస్పీ ప్రసాద్, యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నాటక పోటీలకు 'జగదేక సుందరి సామా' ఎంపిక

● 'శ్రీ వేంకటేశ్వర మహత్యం' కూడా...

కర్నూలు కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నుంచి రెండు పద్యనాటకాలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. టీజీవీ కళాక్షేత్రం కళాకారులు నటిస్తున్న 'జగదేక సుందరి సామా' చారిత్రక పద్య నాటకం రెండు జాతీయ నాటక పరిషత్తు పోటీలకు ఎంపిక కాగా 'శ్రీ వేంకటేశ్వర మహత్యం' కూడా పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 2 వరకు తెనాలిలోని కళల కాణాచి నాటక సంస్థ ఆధ్వర్యంలో, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ నిర్వహిస్తున్న పద్య నాటక పోటీలకు 'జగదేక సుందరి సామా' నాటకం ఎంపికైనట్లు తెలిపారు. తమ నాటకం తెనాలిలో సెప్టెంబరు 30న ప్రదర్శన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే సెప్టెంబరు 5 నుంచి 9 వరకు అనంతపురంలో మైకెల్ అండ్ రెవెన్యూ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగే పద్య నాటక పోటీలకు కూడా 'జగదేక సుందరి సామా' ఎంపికైనట్లు తెలిపారు. ఈ నాటకం సెప్టెంబరు 5న సాయంత్రం 6 గంటలకు అనంతపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

అదేవిధంగా టీజీవీ కల్చరల్ అకాడమీ నాటక సంస్థ ఆధ్వర్యంలో 'శ్రీ వేంకటేశ్వర మహత్యం' పౌరాణిక పద్య నాటకం సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 2 వరకు తెనాలిలో జరిగే పద్య నాటక పోటీలకు ఎంపికైనట్లు నాటక దర్శకుడు వీవీ రమణారెడ్డి మరో ప్రకటనలో తెలిపారు. ఈ నాటకం తెనాలిలో సెప్టెంబరు 27న ఉదయం 10:30 గంటలకు ప్రదర్శన ఉంటుందన్నారు.

కర్ణాటకకు తరలిస్తున్న ఎరువులు సీజ్



పట్టుబడ్డ ఎరువులపై కేసులు నమోదు చేస్తున్న వ్యవసాయ, పోలీసు అధికారులు

మంత్రాలయం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న ఎరువులను వ్యవసాయాధికారులు సీజ్ చేశారు. మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద అక్రమంగా ఎమ్మిగనూరు నుంచి కర్ణాటకకు తరలిస్తున్న ఎరువులను ఎక్సైజ్ పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి జీరగణేష్ తెలిపారు. వివరాలు.. ఎమ్మిగనూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ట్రేడర్స్ నుంచి శంకప్పగౌడు వాహనంలో తీసుకెళ్తున్నారు. వ్యవసాయాధికారులు మాధవరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాహనాన్ని తనిఖీ చేసి 110 బస్తాల ఎరువుల పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఇందులో డీఏపీ, 1919, 102626 రకంతో పాటు 40 బస్తాల యూరియాను సీజ్ చేసి మాధవరం గ్రామ సచివాలయంలో ఉంచారు. ఎరువులను, వాహనం మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఉంచి జాయింట్ కలెక్టర్‌కు సరెండర్ చేశామని తెలిపారు. ఏఈవో తిరుమల్‌రెడ్డి, ఏఈవో విజయ్, వీఆర్ఏ పంపాపతి పాల్గొన్నారు.

స్థలం కబ్జాపై విచారణ

● సీఎం చంద్రబాబుకు గుట్టపాడు సర్పంచ్ ఫిర్యాదు

● కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం



కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విచారణలో పాల్గొన్న కర్నూలు ఆర్డీవో బృందం

కల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కల్లూరు జడ్పీహెచ్ఎస్ స్థలం కబ్జాపై రెవెన్యూ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఈ స్థలాన్ని కబ్జా చేశారని, విచారణ జరిపి చట్టపరంగా చర్యలు చేపట్టాలని ఓర్వకల్లు మండలం గుట్టపాడు సర్పంచ్ ఎన్.మోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. జూలై నెలలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం పాణ్యం నియోజకవర్గం టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని అక్రమాలపై ఆయన సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. విచారణకు ఒక టీంను ఏర్పాటు చేసి నిజాలు నిగ్గు తేలుస్తామని హామీ ఇచ్చారు. ఈఅంశంపై కలెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు ఆర్డీవో కార్యాలయ ఏవో వేణుగోపాల్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుతో కలిసి పాఠశాల స్థలాన్ని మండల సర్వేయర్ సుధాకర్‌తో సర్వే చేయించారు. ఎంఈవో శ్రీనివాసులు పాఠశాల హెచ్ఎం. డీసీ హుసేని, నాల్గవ పట్టణ సీఐ, వీఆర్వోలు మహేశ్వరరెడ్డి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

వరదల్లో రికార్డులు కొట్టుకుపోయాయి

2007లో వచ్చిన వరదల్లో పాఠశాలలోని రికార్డులు కొట్టుకుపోయాయని ఎంఈవో శ్రీనివాసులు, హెచ్ఎం హుసేని లేఖలో ఇచ్చారని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. 2002లో కల్లూరు జడ్పీ స్కూల్ కోసం ఎకరా స్థలం అలాట్ చేసినట్లు సమాచారం ఉందన్నారు. సర్వే నెంబరు 442-ఏ, 444 రెండు సర్వే నెంబర్లలో ఉన్న పాఠశాల విస్తీర్ణాన్ని మండల సర్వేయర్‌తో కొలువగా 1.12 సెంట్లు ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రాథమిక విచారణలో భాగంగా సర్వే చేపట్టామన్నారు. పూర్తి స్థాయిలో స్కూల్ రికార్డులు పరిశీలించి అక్రమాలు ఏమైనా నిర్ధారణ అయితే చట్టపరంగా చర్యలకు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. పాఠశాల రికార్డుల కోసం జడ్పీ సీఈవోకు లేఖ రాస్తామన్నారు.

టీడీపీ నేత ఔదార్యం

● జడ్పీ స్కూల్ నిర్మాణానికి భూమి విరాళం

● అభినందించిన విద్యాశాఖ అధికారులు

ఆలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి సి. నారాయణరెడ్డి ఔదార్యం చాటారు. ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి నాలుగెకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. ఆలూరు మండలం ముద్దనగేరి గ్రామానికి జడ్పీ పాఠశాల మంజూరైంది. ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన నారాయణరెడ్డి తన సొంత పొలం నాలుగెకరాల భూమిని విరాళంగా పాఠశాల నిర్మాణం కోసం ప్రకటించారు. మంగళవారం గ్రామంలో సమగ్రశిక్ష ప్రాజెక్టు డీఈఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలూరు ఎంఈవో 2 చిరంజీవిరెడ్డితో కలసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలదాత నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో జడ్పీ పాఠశాల లేక పోవడంతో విద్యార్థులు పక్క గ్రామాలకు వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడేవారన్నారు. తమవంతుగా పాఠశాల నిర్మాణానికి స్థలం విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే స్థలాన్ని పాఠశాల పేరుమీద రిజిస్ట్రేషన్ చేసి అప్పగిస్తామన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్టు జిల్లా డీఈఈ విష్ణువర్ధన్‌రెడ్డి

విద్యాశాఖ అధికారులు, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు అభినందించారు.

తప్పుల తడకగా పాసు పుస్తకాలు

● సరిదిద్దేందుకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం

● రాజముద్రతో అందుబాటులోకి రానున్న పాసు బుక్కులు

● గత ప్రభుత్వ విధానాలతో ఇబ్బందుల్లో రైతులు



కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఇచ్చిన రైతు పాసు పుస్తకాలు తప్పుల తడకగా ఉన్నాయి. వీటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. రైతులకు ఎవరి బొమ్మలు లేకుండా రాజముద్రతో పాసు పుస్తకాలు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు దాదాపు రెండున్నర లక్షల పాసు పుస్తకాలు ఆయా మండలాల తహసీల్దార్లకు చేరాయి. ఆగస్టు 15 నుంచి వీటిని రైతులకు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే.. పాసు పుస్తకాల్లో వివరాలు తప్పుల తడకగా ఉండటంతో వాటిని సరిదిద్దిన తర్వాతనే రైతులకు అందించాలని రెవెన్యూ శాఖ అధికార యంత్రాంగం రైతులకు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. గత ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్ ఫొటోతో ఇచ్చిన పాసు పుస్తకాలపై రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఆ పాసు పుస్తకాలను రద్దు చేసింది. రాజముద్రతో పాసు పుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. గత వైసీపీ పాలనలో కేటాయించిన సంయుక్త ఎల్‌పీఎం సంఖ్యలు ఏ మాత్రం మార్పులు లేకుండా చాలా పుస్తకాల్లో ఉండటం రైతులకు తలనొప్పిగా మారింది. అవి ఇక వద్దని ప్రతి రైతుకు వారి పొలాలకు సరైన సరిహద్దులు నమోదు చేసిన తర్వాతనే అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అప్పట్లో ఉమ్మడి జిల్లాకు..

వైసీపీ పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి మూడు విడతల్లో భూముల పొలాలను సర్వే చేశారు. ఆ సర్వే ఆధారంగా 18,514 జాయింట్ ఎల్‌పీఎం నెంబర్ల పరిధిలో 1,37,979 మంది రైతుల ఖాతాలను చేర్చారు. కర్నూలు జిల్లాలో 252 గ్రామాల్లో సర్వే చేయగా.. 21,968 జాయింట్ ఎల్‌పీఎం నెంబర్లు పరిధిలో 61,817 మంది రైతుల ఖాతాలు ఉన్నాయి. నలుగురైదుగురు రైతులకు ఒకే ఎల్‌పీఎం నెంబరును కేటాయిస్తూ పాసు పుస్తకాలు జారీ చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రైతుల ఇబ్బందులను గుర్తించి..

కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి మళ్లీ సబ్ డివిజన్లను ఏర్పాటుచేసి వారి పొలాలకు సంబంధించి ఒకే సబ్ డివిజన్ పరిధిలో ఒకే ఖాతాను ఇచ్చి పొలం వివరాలను నమోదు చేస్తూ పాసు పుస్తకాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం తహసీల్దార్ల కార్యాలయాల్లో ప్రభుత్వం నుంచి అందిన పాసు పుస్తకాల్లో తప్పు ఒప్పులను సరి చేసే పనుల్లో యంత్రాంగం అంతా నిమగ్నమై ఉన్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి సరైన వివరాలతో రైతులకు పాసు పుస్తకాలను అందించడం జరుగుతుందని డీఆర్వో వెంకటరమణమ్మ తెలిపారు.

నగరాభివృద్ధికి సహకరించాలి

● జాయింట్ కలెక్టర్ నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని దామోదరం సంజీవయ్య కూడలి నుంచి కేవీఆర్ గార్డెన్ వరకు రహదారి విస్తరణలో ప్రభావితమయ్యే ఆస్తి యజమానులు నగరాభివృద్ధికి సహకరించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. మంగళవారం చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్‌హాలులో 82మంది ప్రభావిత ఆస్తి యజమానులతో కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నగరానికి భవిష్యత్తు రవాణా సౌకర్యాలు మెరుగుపడటానికి రహదారి విస్తరణ అత్యవసరమన్నారు. త్వరిగతిన పనులు ప్రారంభించాలని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎవరూ నష్టపోకుండా ఆస్తులు కోల్పోతున్నవారికి టీడీఆర్ బాండ్ల రూపంలో, భవనాలకు నగదు రూపంలో తగిన పరిహారం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే కొందరికి టీడీఆర్ బాండ్లు అందజేశామని, మరి కొందరికి త్వరలోనే అందిస్తామని జేసీ తెలిపారు. మెరుగైన రవాణా, ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గుండ్రేవులపై సీఎం సానుకూలం..!

● చంద్రబాబుకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వినతి

కర్నూలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల జలాశయం నిర్మించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. జిల్లా పశ్చిమ ప్రాంతం తాగు, సాగునీటి అవసరాలతో పాటు కర్నూలు నగరం తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం గుండ్రేవుల జలాశయం నిర్మాణం ఒక్కటే మార్గమని, ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతిపత్రం అంజేశారు. సీఎం ఈ ప్రాజెక్టుపై సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇదే అంశంపై ఈ నెల 18న కేంద్ర జలవనరుల శాఖకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేఖ రాసినట్లు తెలిపారు.

ఉల్లి కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణ

కర్నూలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోళ్లపై ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ సీఐ పవన్ కిశోర్ ఆధ్వర్యంలో సిబ్బంది మార్కెట్ యార్డుకు వెళ్లి విచారించారు. కొంతమంది ట్రేడర్స్ ఉల్లి కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంపై రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ ట్రేడర్స్‌కు ఉన్న లైసెన్సులు, ఇన్‌కంట్యాక్స్ పత్రాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. కొంత మంది ట్రేడర్స్‌కు లైసెన్సులు లేకపోవడం, వారు ఎలాంటి ఇన్‌కం ట్యాక్స్ ఫైల్ చేయడం లేదనే విషయాలు విజిలెన్స్ విచారణలో వెలుగులోకి వచ్చాయి. అలాగే మహారాష్ట్ర నుంచి కొంత ఉల్లి ఉత్పత్తులను దిగుమతి చేసుకుని గోడౌన్‌లో భద్రపరిచినట్లుగా గుర్తించారు. తాము కొనుగోలు చేసిన ఉల్లిని విక్రయించుకునేందుకు బయటి నుంచి వచ్చిన ఉల్లిని కొనడంలేదని విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో సెక్రటరీ జయలక్ష్మితో సమావేశమై పలు విషయాలపై ఆరా తీశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని విజిలెన్స్ సీఐ పవన్ కిశోర్ తెలిపారు.

విఘ్నాలు తొలిగి విజయాలు చేకూరాలి

● వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

కర్నూలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలని కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎంపీ బస్తిపాటినాగరాజు ఆకాంక్షించారు. మంగళవారం ఆయన జిల్లా ప్రజలకు వారు వినాయచవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కర్నూలు జిల్లా మతసామరస్యానికి ప్రతీక, కులమతలకు అతీతంగా వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం సివిల్ కానిస్టేబుల్స్‌కు, మంగళవారం ఏపీఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు వెరిఫికేషన్ నిర్వహించినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సివిల్స్, ఏపీఎస్పీ విభాగాలకు మొత్తం 643 మంది అభ్యర్థులుగానూ 617 మంది హాజరయ్యారని, 26 మంది గైర్హాజరైయారని తెలిపారు. అడిషినల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డీపీవో ఏవో విజయలక్ష్మి, ఆర్ఐలు జావేద్, సోమశేఖర్ నాయక్, డీపీవో సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పర్యావరణహితం

● ఆదర్శం 'కొండవీటి గణేశ్'

● 34 ఏళ్లుగా పర్యావరణ రక్ష విగ్రహాల ఏర్పాటు



ఎమ్మిగనూరు పట్టణంలోని కొండవీటి ప్రాంతంలో వింజామర ఈకలు, పూసలు, రుద్రాక్షలతో తయారు చేసిన మారుతి వినాయకుడు

ఎమ్మిగనూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే అందరి చూపు ఎమ్మిగనూరు కొండవీటి ప్రాంతంలోని బాల వినాయక యువ మండలి వైపే ఉంటుంది. ఈ ఏడాది ఎలాంటి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారనే ఆసక్తి పట్టణవాసుల్లో ఉంటుంది. ఎవరూ ఊహించని రీతిలో వివిధ రకాల పూజాసామగ్రితో వినూత్నంగా 34 ఏళ్లుగా ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ రహితంగా ప్రతి ఏడాది వివిధ రకాల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ఎమ్మిగనూరు ప్రాంతంలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. బాలవినాయక యువ మండలి నిర్వాహకులు తెలుగు రాముడుతో పాటు మరికొంతమంది తమ సొంత నిధులతో పూజా సామగ్రితో రూ.లక్షలు వెచ్చించి విగ్రహాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. అంతేగాక మండలి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తి భావంతో పాటు సేవా భావాన్ని చాటుకుంటున్నారు. ఈ ఏడాది కూడా రూ.3 లక్షలు వెచ్చించి మంత్రాలయం, శ్రీశైలం, మహానంది ప్రాంతాలనుంచి వింజామర ఈకలు, అయ్యప్ప ధారణ పూసలు, రుద్రాక్షలు తీసుకొచ్చి మండలికి చెందిన రఘువీర, బండాశేఖర్, అశోక్‌లు రెండు నెలలు శ్రమించి మారుతి వినాయకుడి విగ్రహాన్ని రూపొందించారు. వినాయక చవితి సందర్భంగా మొదటి రోజు, చివరి రోజు పేదమహిళలకు చీరలు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేయనున్నారు.

ప్రతి ఏటా విభిన్నంగా

ప్రతిఏడాది ఏదో ఒక పూజా సామగ్రితో వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నాం. 34 ఏళ్లుగా మా వినాయక మండలి సభ్యుల సహకారంతో వినూత్నంగా ఏర్పాటు చేస్తు పట్టణంలో ప్రత్యేకత చాటుకుంటున్నాం. గణేశ్ ఉత్సవాల్లో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 500 మంది మహిళలకు చీరలు, దివ్యాంగులకు, సాధువులకు దుస్తులు, పేద విద్యార్థులకు పుస్తకాలు అందిస్తూ వస్తున్నాం.

- రాముడు, బాలవినాయక యువమండలి

● 34 ఏళ్లుగా వినూత్న రీతిలోనే...

కొండవీటి బాల వినాయక యువ మండలి ఆధ్వర్యంలో 1992నుంచే వినూత్న రీతిలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. 33ఏళ్లుగా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న ఎప్పుడు కూడా ప్లాస్టరాఫ్ పారిస్, కెమికల్ రంగులను వాడకుండా కేవలం మట్టి, పూజాసామగ్రిని మాత్రమే వినియోగించి విగ్రహాలను రూపొందిస్తున్నారు. 1992లో నవధాన్యాలతో తయారు చేసిన వినాయకుడు, 1993లో శనగపప్పులతో, 1994లో నాట్య వినాయకున్ని ప్రతిష్ఠించగా 1995లో వక్కలతో తయారు చేసిన వినాయకుడు, 1996లో గోడంబి, ద్రాక్షలతో, 1997లో వెలగకాయలతో, 1998లో బాదంపప్పతో, 1999లో ఎండు ఖర్జూరంతో, 2000లో నవధాన్యలతో, 2001లో రుద్రాక్షమాలతో, 2002లో పసుపు కొమ్ములతో, 2003లో అనుముల విత్తనాలతో, 2004లో తులసి పూసలతో, 2005లో నవరత్నాలు, పూసలతో, 2006లో కానిపాక వినాయకుడు, 2007లో పచ్చి వక్కలతో, 2008లో ముత్యాల పూసలతో, 2009లో మొక్కజొన్నలతో, 2010లో కస్తూరి పూసలతో, 2011లో సోయాబిన్ విత్తనాలతో తయారు చేశారు. 2012లో బాదం విత్తనాలతో, 2013లో దశావతార వినాయకుడు, 2014లో రుద్రాక్షలు, తులసి పూసలతో తయారు చేసిన వినాయక విగ్రహం, 2015లో తులసీపూసలు, రుద్రాక్షలతో తయారుచేసిన దత్తాత్రేయ వినాయకుడు, 2016లో గోమేధిక, చక్రాంతికలు, కమలాక్షీ పూసలతో శివపుత్ర గజకర్ణి వినాయకుడు, 2017లో గజేంద్ర మోక్షవినాయకుడు, 2018 శంకములతో తయారు చేసిన సుబ్రహ్మణ్య వినాయకుడు, 2019 బాదావికాయలతో తయారు చేసిన శ్రీకృష్ణ వినాయకుడు, కరోనా సమయంలో 2020.2021లో సమీపంలోని ఆలయంలో చిన్నవిగ్రహాలు ప్రతిష్ఠించారు. 2022 కమలాక్షి పూసలు, అడవిటెంకాలయలతో అయ్యప్ప వినాయకుడు విగ్రహాన్ని, 2023లో తులసి మాల, పువ్వు రుద్రాక్షలు, ఆముదాలు కుసుమలతో బ్రహ్మ, విష్ణు,మహేశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయగా 2024లో 70 కిలోల రుద్రాక్షలతో ఆకర్షణీయంగా నరసింహ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం వినాయకచవితి సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలుగు రాముడు, రఘువీర, ఆశోక్, సాయి,గణేష్, బండా శేఖర్ తెలిపారు.

గడువు పెంచారు..!

● 29 వరకు బార్ల నిర్వహణకు దరఖాస్తులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బార్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడువును పెంచింది. ఈనెల 29 వరకు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 26 బార్లకు సంబంధించి కర్నూలులో 12, ఆదోనిలో 13 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఎమ్మిగనూరు, గూడూరు సెంటర్ల నుంచి ఒక్కరు కూడా దరఖాస్తు చేసేందుకు ముందుకు రాలేదు. రాష్ట్ర స్థాయిలో నూతన బార్ పాలసీని యాజమాన్యాలు వ్యతిరేకిస్తున్న తీరుపై ప్రభుత్వం కూడా సాయంత్రం వరకు వేచి చూసింది. చివరి ఆరగంటలో ఈనెల 29 వరకు గడువు పొడిగిస్తున్నట్లు ఆదేశాలు ఇచ్చింది. 139 మంది బార్ల దరఖాస్తుల కోసం ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నప్పటికి పూర్తి స్థాయిలో ప్రక్రియను పూర్తి చేసేందుకు ఆసక్తి చూపలేదు. మంగళవారం సాయంత్రంలోపు పూర్తి స్థాయిలో బార్లకు దరఖాస్తులు వస్తాయని ఆశించిన ఎక్సైజ్ శాఖ ఒక్కసారిగా డీలా పడింది. బార్ల యాజ్యమాన్యాలు మాత్రం తాము దరఖాస్తులు వేసేది లేదని, ప్రభుత్వం మరో నెల రోజులు పాత పాలసీనే కొనసాగించే అవకాశం ఉందని చర్చించుకుంటూ కనిపించారు.

11 మంది సీఐలు బదిలీ

కర్నూలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో 11 మంది సీఐలను బదిలీ చేస్తూ రాయలసీమ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.తిమ్మారెడ్డి	డీఎస్‌బీ-2, అన్నమయ్య	ప్రొద్దుటూర్ వన్‌టౌన్ యూపీఎస్
బి.రామకృష్ణారెడ్డి	ప్రొద్దుటూరు వన్‌టౌన్	రిమ్స్ యూపీఎస్
వి.సీతారామిరెడ్డి	రిమ్స్ యూపీఎస్	పులివెందుల యూపీఎస్
ఎస్.చాంద్‌బాషా	పులివెందుల యూపీఎస్	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైం సెల్, నంద్యాల
ఎస్.వంశీధర్	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైం సెల్, నంద్యాల	ఖాజీపేట్ యూపీఎస్
ఆర్.మోహన్	ఖాజీపేట్ యూపీఎస్	వీఆర్, కడప
జే.రమేష్ కుమార్	ఆదోని ట్రాఫిక్ పీఎస్	సీసీఎస్-3, కర్నూలు
జి.ఇబ్రహీం	సీసీఎస్-3, కర్నూలు	డీటీసీ, కర్నూలు
టి.అబ్దుల్ గౌస్	డీటీసీ, కర్నూలు	ఆదోని ట్రాఫిక్ పీఎస్
ఎం.నాగభూషణ్	సీకే దిన్నె యూపీఎస్	ప్రొద్దుటూరు రూరల్
బి.బాల మద్దిలేటి	ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్	సీకే దిన్నె యూపీఎస్


బాలిక మృతదేహం వద్ద అధికారులు

డెంగీతో బాలిక మృతి

- వెల్దుర్తికి వచ్చిన అధికారులు

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ బాలిక డెంగీతో మృతి చెందడంతో కలకలం రేగింది. మండల కేంద్రంలోని 6వ వార్డులో నివాసముంటున్న సీపీఐ నాయకుడు టి.కృష్ణ, సునీత కుమార్తె మోక్షిత (5)కు గత వారం జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. డెంగీ లక్షణాలను గమనించిన వైద్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో ఈ నెల 22న కర్నూలుకు తరలించారు. కాగా బాలిక ఆసుపత్రిలో కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. బాలిక శారద కాన్వెంట్ స్కూల్‌లో రెండో తరగతి చదువుకుంటోంది. తమ్ముడు హేమంత్ ఉన్నారు. కూతురి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి,

అప్రమత్తమైన అధికారులు..

బాలిక డెంగీతో మృతిచెందడంతో పంచాయతీ, వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. బాలిక ఇంటి పరిసరాల్లో పారిశుధ్య పనులు చేయించి, దోమల మందును పిచికారీ చేయించారు. విషయం తెలుసుకున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైసీపీ మండల అధ్యక్షులు బొమ్మన రవిరెడ్డి, జడ్పటీసీ దారిపోగు సుంకన్న బాలికకు నివాళి అర్పించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించి, పారిశుధ్య విషయంలో అశ్రద్ధ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడి వైద్యసేవల వివరాలను తెలుసుకున్నారు.

పరామర్శించిన డీఎంహెచ్‌వో, ఆర్డీవో, డీపీవో

బాలిక మృతితో డీఎంహెచ్‌వో శాంతికళ, ఆర్డీవో సందీప్ కుమార్, డీపీవో భాస్కర్ వెల్దుర్తి వచ్చి బాలిక మృతి కారణాలను అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌పీవో లక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, డిప్యూటీ ఎంపీడీవో రవికిషోర్, ఆర్ఐ మంజుల, సెక్రటరీ లక్ష్మీనాథ్, ఎస్‌బీ కానిస్టేబుల్ సుకుమార్, టీడీపీ నాయకులు బలరాంగౌడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

నలుగురు చిన్నారులు అదృశ్యం

- సమీప బంధువుపైనే అనుమానం
- రంగంలోకి దిగిన పోలీసులు

కోడుమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒకరిద్దరు కాదు ఏకంగా నలుగురు చిన్నారులు అదృశ్యమైన ఘటన పట్టణంలో సంచలనం సృష్టిస్తుంది. ఈఘటన ఆలస్యంగా వెలుగు చూసినట్లు ఎస్ఐ డి.వై స్వామి తెలిపారు. వివరాలు.. కోడుమూరు పట్టణానికి చెందిన చరణ్, అనిల్ అనే ఇద్దరు మైనర్లు. వీరితో పాటు మరో ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉంటే వీళ్లతో పాటు చిన్నారుల సమీపం బంధువు రాజు అనే వ్యక్తి కూడా కనిపించకుండా పోవడంపై చిన్నారుల తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీళ్లంతా ఈనెల 19న రాత్రి 7గంటల నుంచి కనిపించకుండా పోవడంతో పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి. రాజు అనే వ్యక్తి భార్య, పిల్లలను వదిలేసి కడప జిల్లా నుంచి రెండు నెలల కిందట కోడుమూరుకు వచ్చాడు. బంధువులు ఆశ్రయం ఇవ్వడంతో స్థానికంగా ఓ గుజరీ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి ఇటీవల కాలంలోనే ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ 19న రాజు, వివాహేతర మహిళ కలిసి మాయమాటలు చెప్పి చిన్నారులను తీసు కెళ్లినట్లు తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. వీళ్ల ఆచూకీ కోసం రెండు పోలీసు బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

బనగానపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఎస్సార్బీసీ కాల్వలో పడి ఓ రైతు మృతిచెందాడు. ఈఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. వివరాలు.. బత్తులూరుపాడు గ్రామానికి చెందిన రైతు కురువ రామనాథ్(35) రెండు రోజుల క్రితం పొలంలో వ్యవసాయ పనులు ముగిం చుకు న్నాడు. స్నానం చేసేందుకు ఎస్సార్బీసీ కాల్వలో వద్దకు వెళ్లాడు. ప్రమాదశాత్తు కాలుజారి కాలువలో పడ్డాడు. బంధువులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాళ్లకొత్తూరు సమీపంలో రామనాథ్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

- తీర్పు ఇచ్చిన జిల్లా ప్రధాన న్యాయాధికారి

కర్నూలు లీగల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.6వేలు జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నన్నూరుకు చెంది నిందితుడు బోయ తోట శివ(35)పై పలు క్రిమినల్ కేసులు ఉండటంతో ఆయనపై గతంలో రౌడీషీట్‌ను పోలీసులు తెరిచారు. ఈ నేపథ్యంలో 2017 నవంబరు 19వ తేదీన సాయంత్రం ఓర్వకల్లు చెందిన సలాంబాషా ఒక హోటల్ వద్ద టీ తాగుతుండగా.. నిందితుడు అక్కడకు వచ్చి అతడి తలపై ఉన్న టోపీని లాగేసి అనుచితంగా ప్రవర్తించాడు. సలాం బాషా సోదరుడు అడ్డుకుని ప్రశ్నించడంతో శివ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి కొద్దిసేపటికీ శివ తన ఇంట్లోని కత్తిని తీసుకువచ్చి టీహోటల్ వద్ద ఉన్న సలాంబాషాను కత్తితో ఇష్టమొచ్చినట్లు పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. అక్కడే ఉన్న సలాంబాషా సోదరుడు, మరి కొంత మంది గ్రామస్థులు గాయపడిన సలాంబాషాను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సలాంబాషా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు హతుడి సోదరుడు ఆజాంశాలీ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓర్వకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి కర్నూలు అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగరాజుయాదవ్ నిందితుడు తోట శివను అరెస్టు చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి జి.కబర్ది తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ వెంకటరెడ్డి వాదించారు.


శివను జైలుకు తరలిస్తున్న పోలీసులు

మిస్టరీగా వెంకటేష్ మృతి

- కుళ్లిపోయిన మృతదేహం, పరారైన భార్య, కూతురు
- కొడుకు మృతిపై తల్లి అనుమానాలు
- న్యాయవిచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు


వెంకటేశ్(ఫైల్)

మద్దికెర ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలోని మెయిన్‌బజారుకు చెందిన ముగతి వెంకటేశ్ (54) మృతి మిస్టరీగా మారింది. భార్య, కూతురు మూర్ఛవ్యాధితో చనిపోయాడని చెబుతుండగా. మృతుడి తల్లి మాత్రం అనుమానాలు వ్యక్తం చేస్తూ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌నాయక్ తెలిపారు.

వివరాలు.. మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ముగతి వెంకటేశ్, భార్య సరస్వతి, కూతురు కుసుమతో కలిసి ఉంటున్నాడు. అతడికి మూర్ఛ వ్యాధి ఉంది. నాలుగు రోజుల క్రితం ఇంటి ఆవరణలో వెంకటేష్ పడిపోయి మృతిచెందినా భార్య కూతురు ఎవరికీ సమాచారం ఇవ్వలేదు. మృతదేహాన్ని ఇంటి బ యటే పడే శారు. నాలుగు రోజులుగా అక్కడే పడి ఉండటంతో వెంకటేశ్ మృత దేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో భార్య సరస్వతి, కూతురు కుసుమ ఇల్లు వదిలి పారి పోయారు. పరిసర ప్రాంత ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా అప్పటికే శవం కుళ్లిపోయింది. వెంకటేశ్ తల్లి ముగతి రామలింగమ్మ నా కుమారుడు వెంకటేశ్‌ను కోడలు సరస్వతి, కూతురు కుసుమ చంపే శారని ఆరోపిస్తు న్నారు. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు ఉన్నా యని, నా కుమారుడు మెతక స్వభావం కలిగినవాడని తెలిపారు. భార్యాభర్తల గొడవలు పలుమార్లు పెద్దల సమక్షం లో రాజీ చేయడం కూడా జరిగిందన్నారు. శవాన్ని నాలుగు రోజుల పాటు ఇంటి ఆవర ణలో ఎలా పెట్టుకుంటారని ప్రశ్నించారు. నా కుమారుడు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపి న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లుకు తరలించారు.

ఇద్దరు ఉద్యోగులకు మెమోలు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఇద్దరు ఉద్యోగులకు కమిషనర్ పి.విశ్వనాథ్ మంగళవారం మెమోలు జారీ చేశారు. కమిషనర్ బంగ్లా ఎదురుగా సెట్‌బ్యాక్స్ లేకుండా ఒక నిర్మాణం జరుగుతోంది. దాని గురించి ఐదు రోజుల ముందు కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయిన ఇప్పటికి ఆ నిర్మాణం పనుల అలాగే జరుగుతున్నాయి. దీంతో కమిషనర్ ఆదేశాలను పట్టించుకోకపోవడంతో సచివాలయ కార్యదర్శి, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లకు కమిషనర్ మెమోలు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని మెమోలో పేర్కొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దేశానికి మదర్ థెరిస్సా చేసిన సేవలు మరువలేనివని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కొనియాడారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా మంగళవారం సంకల్‌బాగ్ దారిలోని కూడలిలో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో కేక్ కట్ చేయించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకొని ఇతరులకు సాయంచేసి మానవత్వాన్ని చాటుకోవాలని సూచించారు. అభయగిరిలో సేవా కార్యక్రమాల నిమిత్తం తమవంతు సహకారం అందజేస్తున్నట్లు టీజీ వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి విద్యాసంస్థల డైరెక్టర్ దీక్షిత్, సురేంద్ర, నృత్య గురువు రామకృష్ణ, అభయగిరి నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: మదర్ థెరిస్సా జీవితం పేదల సేవలకే అంకితం చేసిందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ అన్నారు. మంగళవారం నగరంలోని సంకల్బాగ్‌లో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి కోడుమూరు ఇన్ చార్జి అనంతరత్నం మాదిగతో కలిసి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాజా హుసేన్, ఎంఎస్ ఖాద్రీ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: మదర్ థెరిస్సా సేవలు అభినందనీయమని జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ రవికుమార్ అన్నారు. మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని ఆగాపే డెంటల్ కేర్, మినిస్ట్రీస్ సంయుక్త అధ్వర్యంలో ఔట్‌డోర్ స్టేడియం వద్ద దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు రోగులకు పరీక్ష నిర్వహించారు.


మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె అర్హులైన లబ్ధిదారులకు రూ. 6,48,599 సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో స్టేట్ కోటా ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 2025-26 మొదటి సంవత్సరానికి మంగళవారం మొదటి ర్యాంకు 68 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ తెలిపారు. ఈనెల 29న మొదటి విడ త కింద ఎంబీబీఎస్ అడ్మిషన్లకు అవకాశం ఉందన్నారు.

నేత్రదానం చేయండి

ఓర్వకల్లు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం పీహెచ్‌సీలోని గుట్టపాడు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, ఆరోగ్య కార్యకర్త హేమ లత, ఆశా వర్కర్ నజీజ్, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

యూరియాను అక్రమంగా విక్రయిస్తే చర్యలు

ఓర్వకల్లు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేసిన యూరియాను అక్రమంగా విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ విద్యాసాగర్ హెచ్చరిం చారు. మంగళవారం ఆయనతోపాటు ఏవో మధుమతితో కలిసి ఓర్వకల్లులో ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, రికార్డులను పరిశీలించారు.

అబ్దుల్ హక్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కర్నూలు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉస్మానియా కళాశాల వ్యవ స్థాపకుడు డాక్టర్ ఎం. అబ్దుల్ హక్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సమీవుద్దీన్ ముజమ్మల్ అన్నారు. మంగళవారం సమాజంలో విద్యార్థులకు మానవీయ విలువలు అవశ్యకత అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. అనంతరం అతిథులకు శాలువ కప్పి సన్మానించారు. మండి అన్వర్ హుసేన్, హజ రత్ ముఫ్తి సబీల్ అహ్మద్, ముఫ్తి మన్సూర్ అహ్మద్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణం కోసమే జనసేన పార్టీ ఆవిర్భావించిందని ఆ పార్టీ మహిళ సాధికారత చైర్మన్ రేఖా గౌడు అన్నారు. మంగళవారం స్థానిక కేఈ ప్లాజాలో 'సేనతో సేనాని' పోస్టర్‌ను ఆవిష్కరించారు. రేఖాగౌడు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమంపై ఈనెల 30న జనసేనాని పవన్‌కల్యాణ్ అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం విశాఖ పట్టణంలో జరగనుందని, ఈనేపథ్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు.

దీక్షిత్‌కు అవార్డుపై హర్షం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హౌస్ ఆఫ్ లార్డ్ బ్రిటీష్ పార్లమెంటు యునైటెడ్ కింగ్‌డమ్ వరల్డ్ స్కూల్స్ సమ్మిట్ 2025- ది ఇన్నోవేటర్ ది ఎడ్యుకేషన్ కేటగిరిలో ఇండియా నుంచి ఎంపికై బ్రిటీష్ పార్లమెంటు హౌస్ ఆఫ్ లార్డ్ సభ్యులు, లార్డ్ బ్యానెల్ బ్రెయినన్ నుంచి శ్రీలక్ష్మి విద్యాసంస్థల చైర్మన్ పి.దీక్షిత్ ఈ అవార్డును అందుకోవడంపై రాయలసీమ విద్యార్థి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలలో చైర్మన్ దీక్షిత్‌ను కలిసి విద్యార్థి సంఘం నాయకులు సత్కరించారు. సర్వేపల్లి విద్యాసంస్థల కరస్పాండెంట్ శేషన్న, నాయకులు రవికుమార్, సుంకన్న, జిల్లా అధ్యక్షుడు అశోక్, భరత్ కుమార్, రాము, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సి.బెళగల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుసేన్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పదో తరగతి పాసై శిక్షణ పొందిన మహిళలకు బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. ఎంపీడీవో రాణెమ్మ ఉన్నారు.

పత్తిలో కాయకుళ్లు నివారణకు చర్యలు

కల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపంటలో రైతులు కాయకుళ్ల నివారణ చర్యలు తీసుకోవాలని నంద్యాల వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త శివ రామకృష్ణ సూచించారు. మంగళవారం కల్లూరు మండలంలో ఆయన వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి లక్ష్మీపురం, పుసులూరు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఎంటమాలజీ శాస్త్రవేత్త రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను యూరియా, గిట్టుబాటు ధర, పత్తి దిగుమతి లాంటి విషయాలలో అన్ని కోణాల్లో మోసం చేస్తుందని విమర్శించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్. రాధాకృష్ణ, పి.నిర్మల, ఎండి.ఆనంద్‌బాబు, జి.రామక్రిష్ణ, కె.వెంకటేశ్వర్లు, కేవీ నారాయణ, టి.రాముడు, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించరాదు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించరాదని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అధ్యక్షుడు సూరిబాబు అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. దండు వీరయ్య మాదిగ మాట్లాడుతూ దివ్యాంగుల విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లు 4 శాతం నుంచి 6 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. మహిళా అధ్యక్షురాలు కె.రాధ, నాయకులు రాజశేఖర్, అంజనేయులు, దాసు, మద్దిలేటి, కమలమ్మ, రాణి, అయ్యమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న సంసిధ్ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతోష్ నగర్‌లోని సంసిధ్ పాఠశాల్లో మంగళవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రహమతుల్లా మాట్లాడుతూ వినాయకుని వేడుక ఎంతో విశిష్టమైనదని, బంకమట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. తల్లిదం డ్రులు తమ పిల్లలకు పండుగల్లో పరమార్థాన్ని తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినాయకుడు, శివుడు, పార్వతి, సుబ్రహ్మణ్యస్వామి, మూషికం తదితర వేషధారణలతో ఆకట్టుకున్నారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 4న జరగనున్న గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం నగర పాలక కార్యాలయంలో అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గత ఏడాది గణేశ్ నిమజ్జనం రోజు చోటుచేసుకున్న లోపాలు పునరావృతం కాంకుడా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎంఈ మనోహర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభం: నగరంలో రహదారి విస్తరణ పనులను త్వరలో ప్రారంభించాలని కమిషనర్ పి.విశ్వనాత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఉస్మానియా కళాశాల వద్ద విస్తరణ పనులు చేపట్టాల్సిన రహదారిని పరిశీలించారు.

మార్కెట్ యార్డు చైర్మన్ కమిటీ ప్రమాణ స్వీకారం

కోడుమూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కోడుమూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, ఉప చైర్మన్ ప్రమాణ స్వీకారం మంగళవారం చేపట్టారు. మార్కెట్ యార్డు కార్యదర్శి సుందర్‌రాజు సమక్షంలో చైర్‌పర్సన్ ఆకెపోగు సుగుణమ్మ, ఉప చైర్మన్ ఎల్లప్పనాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే చిరంజీవి, వెంకటరాముడు, బాబు, చిన్న ఎల్లప్ప, పద్మావతి, చరణ్, శ్రీనివాసులు, శివశంకర్, పార్వతమ్మ, ఉమాదేవి, భాగ్యమ్మ, అఖిల, గోపిలు మార్కెట్ యార్డు డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. నాయకులు రామకృష్ణారెడ్డి, బలరాముడు, గంగాధర్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రేశ్వరస్వామి జయంతి

కోడుమూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వీరభద్రేశ్వరస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వీరభద్రేశ్వరస్వామి, భద్రకాళీ చిత్రపటాలను పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ అవినీతిపై విచారణ జరిపించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అవినీతిపై విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాలు ధర్నా నిర్వహించాయి. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్ర నాయుడు, సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ గౌడు, ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాగంటి రాజు, టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ మాట్లాడారు. కరోనా నిబంధనల ప్రకారం అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించకూడదైనప్పటికీ అడ్మిషన్లు నిర్వహించి రూ.లక్షలాది రూపాయలు కాజేశారని ఆరోపించారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

కర్నూలు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు బి.సుజాతకు డాక్టరేట్ లభించింది. సుజాత కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతిలో జంతుశాస్త్ర ప్రొఫెసర్ ఎం.భాస్కర్ పర్యవేక్షణలో డిటర్మినేషన్ ఆఫ్ ఫార్మాల్డిహైడ్, ఇండ్యూస్డ్. యాంటి అక్సిడెంట్, మెటబాలిక్ అండ్ హిస్టో పాథోలాజికల్ చేంజెస్ ఇన్ ది లివర్ అండ్ మజిల్ ఆఫ్ మేల్‌రాట్స్ ఎ స్పెషల్ ఫోకస్ ఆన్ లివర్ జీన్ ఎక్స్ప్రెషన్స్ అండ్ రివర్షన్ ఆఫ్ చేంజెస్ విత్ బ్రాంకోటి అనే అంశంపై పరిశోధనలో ఆమెకు డాక్టరేట్ వరించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి తెలిపారు.

ఫెన్సింగ్ అండర్-17 పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఫెన్సింగ్ క్యాడెట్ (అండర్-17) జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ పోటీలను ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్ శర్మ మంగళవారం ప్రారంభించారు. స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ ఫెన్సింగ్ గేమ్ క్రీడాకారుల వ్యక్తిగత ప్రతిభపై ఆధార పడి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి విజేతలు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. ఈ నెల 30న భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు క్రీడాకారులు విజయం సాధించాలని ఆయన కోరారు. ఈ పోటీల్లో బాలురు, బాలికలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ సీఐ నాగశేఖర్, కోచ్‌లు మహేష్, లక్ష్మీనారాయణ, మణికంఠ, కాళీ, సాయి తదితరులు పాల్గొన్నారు.


మట్టి విగ్రహలను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, రోజా మహిళా ఐక్యసంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత తదితరులు, గూడూరులో..

గ్రేడింగ్ రద్దుకు ఒప్పుకోం..

- అడ్డం తిరిగిన హమాలీలు, కూలీలు
- యధావిధిగా కొనసాగిన కొనుగోళ్లు
- విఫలమైన అధికారుల ప్రయత్నాలు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ గ్రేడింగ్‌కు స్వస్తి పలకాలని మార్కెట్ యార్డు అధికారులు ఎంత ప్రయత్నించినా సఫలం కావడం లేదు. గ్రేడింగ్ రద్దుకు ఒప్పుకోమని కమీషన్ ఏజెంట్లు భీష్మించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం యధావిధిగా మహిళా కూలీలతో వ్యాపారులు గ్రేడింగ్ (పాసింగ్) కొనసాగించారు. రైతులకు నష్టం చేకూర్చే అనధికారిక పాసింగ్ వ్యవస్థను ఎత్తివేయాలని వ్యాపారులపై మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన ఒత్తిడి తీసుకొచ్చిన ఒక్క రోజులోనే ఆమె ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. నిన్నటి వరకు మహిళా కూలీలు ఆందోళన చేస్తే నేడు హమాలీలు కూడా మద్దతు పలికారు. తాము గ్రేడింగ్‌కు ఒప్పుకునేది లేదని కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వన్‌టౌన్ సీఐ శ్రీరాం, తాహసీల్దార్ రమేష్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన వ్యాపారులు కమీషన్ ఏజెంట్లు హమాలీలతో సమావేశమై పలు దఫాలుగా చర్చించారు. అయినా తాము ఒప్పుకోలేమని


కమీషన్ ఏజెంట్లు వ్యాపారులతో చర్చిస్తున్న కార్యదర్శి కల్పన

ఖరాకండిగా చెప్పేశారు. వారి ఒత్తిడి తట్టుకోలేక మార్కెట్ యార్డ్ కార్యదర్శి అధికారుల ప్రయత్నాలు విఫలం కావడంతో పాత విధానం


ఆందోళన చేస్తున్న హమాలీలు

ద్వారానే పాసింగ్ ద్వారానే తూకాలు కొనసాగాయి. గురువారం మరో మారు చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు.

గ్రేడింగ్‌ను కొనసాగించాలి

మార్కెట్ యార్డ్‌లో గ్రేడింగ్‌ను కొనసాగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వీరేష్ కోరారు. మంగళవారం మహిళా కూలీలతో కలిసి ఆందోళన చేశారు. ఏళ్లుగా మహిళలు పనిచేస్తున్నారని గ్రేడింగ్ రద్దు చేస్తే ఉపాధి కోల్పోతారన్నారు. నాయకులు రమేష్, విజయ్, ఈరన్న పాల్గొన్నారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి


బాల ముద్దయ్య

ఆదోని టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నాన్ లేఅవుట్ ప్లాట్లను గడువులోపు క్రమబద్ధీకరించుకోవాలని మునిసిపల్ ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాల ముద్దయ్య సూచించారు. మంగళవారం మాట్లాడుతూ 2025 జూన్ 30వ తేదీ కన్నా ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ భూములు, వివాదాస్పద స్థలాలు, చెరువులు, రహదారుల కోసం కేటాయించిన స్థలాల్లో ఎల్‌ఆర్‌ఎస్‌కు అనుమతి లేదన్నారు. రెండు నెలల్లోపు క్రమబద్ధీక రించుకోకుంటే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి : ఆర్డీవో

మద్దికెర ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలని ఆర్డీవో భరత్ నాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి బియ్యాన్ని అందజేశారు. ప్రభుత్వం లబ్ధిదారులకు త్వరలోనే స్మార్ట్ కార్డులు మంజూరు చేస్తుందన్నారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. తహసీల్దార్ గుండాల్ నాయక్, ఆర్ఐ రామదాసు, వీఆర్వోలు ఉన్నారు.


బియ్యం ఇస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

మొక్కలు నాటి, పెంచాలి

పత్తికొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంటి వద్ద మొక్కలు నాటి వాటిని పెంచాలని ఉత్తమ ఉపాధ్యాయురాలు కళ్యాణి, ఉపాధి ఏపీవో వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం జేఎం తండాలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

నేత్రదానం చేయండి

మద్దికెర ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి ఇతరులకు చూపు ఇవ్వాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.రఘురామి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. 25 నుంచి సెప్టెంబరు 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులను ఆశా కార్యకర్తలు ప్రసవ సమయంలో వైద్యశాలకు తీసుకురావాలన్నారు. వైద్యాధికారి రాగిణి, సీహెచ్‌వో నిరంజన్‌బాబు, వైద్యసిబ్బంది హనుమంతరెడ్డి, అక్బర్ బాషా, విజయ్, సూర్యనారాయణ ఉన్నారు.


మాట్లాడుతున్న డా.రఘురామి రెడ్డి

చట్టాలపై అవగాహన ఉండాలి

పత్తికొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన ఉండాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఝాన్సీదేవి సూచించారు. మంగళవారం సీడీపీవో లలిత ఆధ్వర్యంలో పట్టణంలోని కోయనగర్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి ప్రజలకు చట్టాలు, వాటి విరాలను తెలిపారు. లోక్ అదాలత్ సభ్యుడు సూరజ్ ఉన్నారు.


మాట్లాడుతున్న న్యాయాధికారి ఝాన్సీదేవి

పండ్ల తోటలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఉద్యాన అధికారి రామాంజనేయులు

ఆలూరు(చిప్పగిరి), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పండ్లు, పూల తోటలు సాగు చేస్తే ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తుందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రామాంజినేయులు అన్నారు. మంగళవారం చిప్పగిరి మండలం నంచర్ల గ్రామంలో రైతు అమిద అంజూర తోటలో నిర్మించిన ప్యాక్ హౌస్‌ను పరిశీలించారు. పండ్ల తోటలు రైతులు గ్రేడింగ్ చేసుకోవాడానికి ప్యాక్‌హౌస్ నిర్మాణానికి రూ.2 లక్షలు అవుతుందని ప్రభుత్వం 50శాతం రాయితీ ఇస్తుందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన రామిరెడ్డి చామంతి తోటను పరిశీలించి సుచనలు ఇచ్చారు. మండల ఉద్యానశాఖ అధికారి ఇందిర ఉన్నారు.


చామంతి తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ జిల్లా అధికారి

ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలి

- డీఎంహెచ్‌వో శాంతికళ

వెల్దుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి పరిరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో శాంతికళ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుత్రిని తనిఖీ చేసి, రోగులను పరామర్శించారు. ఎక్స్‌రే, జనరేటర్, సిబ్బంది కొరత ఉందని వైద్యులు ఆమె దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. మలేరియా అధికారి నూకరాజు, డీఎల్పీఓ లక్ష్మీ, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ పాల్గొన్నారు.


వార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కలిసి పనిచేస్తేనే అభివృద్ధి

తుగ్గలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయనీ ఎంపీపీ రామాంజనమ్మ, తహసీల్దార్ రవి, ఇన్‌చార్జి ఎంపీడీవో బాషా అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఎంపీపీ రామాంజనమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. అధికారులు మూడు నెలల నుంచి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను చదివి వినిపించారు. అలాగే భవిష్యత్తులో ఏయే పనులు చేపడుతారో మండల తీర్మాణం చేశారు. ఏపీవో హేమసుందర్, ఏవో సురేష్ యాదవ్, కార్యదర్శి నారాయణ స్వామి, రాజు నాయక్, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

రైతులందరికీ యూరియా

తుగ్గలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా ఇస్తామని తహసీల్దార్ రవి, ఏవో సురేష్ యాదవ్ అన్నారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. అవసరమైన రైతులే తీసుకోవాలని, అధిక మొత్తంలో వాడకూడదన్నారు. అలాగే నానో యూరియాతో దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ఎస్ఐ బాల నరసింహులు, ఏఈవో లక్ష్మినారాయణ ఉన్నారు.


యూరియా ఇస్తున్న తహసీల్దార్, ఏవో

ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించాలి

ఆలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో వైసీపీ ప్రభుత్వం నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించాలని డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిరసన తెలిపారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, డీవైఎఫ్ఐ ప్రాంతీయ అధ్యక్షుడు గోవర్ధన్ మాట్లాడుతూ భవనం సరిపోక రోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే నూతన సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో షైన, కృష్ణ, విటల్, ఉలిగప్ప, రంగనాథ్, మణి, శివరాజు, మేఘశ్యామ, లక్ష్మినారాయణ, బసవరాజు, సురేష్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

ఆలూరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఏవో వెంకటేశ్వర్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి, స్టాక్‌ను పరిశీలించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించవద్దని, స్టాక్, ధరల వివరాలను పట్టికలో ఉంచాలని ఆదేశించారు. రైతుల ఆధార్, ఫోన్ నంబర్ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి, నానో యూరియా వాడాలన్నారు. ఆర్ఐ బసవన్నగౌడ్, వీఆర్వో రవికుమార్ ఉన్నారు.


స్టాక్‌ను తనికీ చేస్తున్న తహసీల్దార్

అందుబాటులో డీఏపీ

మద్దికెర ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మద్దికెర, హంపా, బురుజుల గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో డీఏపీ అందుబాటులో ఉందని ఏవో రవి తెలిపారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో డీఏపీ నిల్వను పరిశీలించారు. మద్దికెరకు 20 టన్నులు, బురుజుల, హంపకు పది చొప్పున డీఏపీ మంజూరైందన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

పత్తికొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కవిత అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మంగళవారం తహసీల్దార్ నూర్ అహ్మద్, ఎంపీపీ దాస్, డిప్యూటీ ఎంపీ డీవో నరసింహులు, అధికారులు, జడ్పీటీ సీలు, సర్పంచులు హాజరయ్యారు. మండలం భివృద్ధిని అధికారులు వివరిం చారు. అనంతరం సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

జొన్నగిరి విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు


లక్ష్మీప్రణతికు మిఠాయి తినిపిస్తున్న అవ్వా, తాత

తుగ్గలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి విద్యార్థిని లక్ష్మీ ప్రణతి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. నీట్‌లో 1,147 రాష్ట్రస్థాయి ర్యాంకు రావడంతో విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ప్రవేశం లభించింది. తల్లిదండ్రులు లోకనాథ్, విజయలక్ష్మి ఉపాధ్యాయులు. అలాగే రాతనకు చెందిన రవికుమార్ కూతురు రవిత్ర యణీ అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది.

ఆరేకల్లు పాఠశాల హెచ్‌ఎం మృతి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేకల్లు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ నూర్ అహ్మద్(59) మంగళవారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య పర్వీన్, ఇద్దరు కూమారులు ఉన్నారు. ఎస్టీయూ అసోసియేటెడ్ జిల్లా ప్రెసిడెంట్ నాగేంద్రప్ప, వీరచంద్ర యాదవ్, నరసింహులు సంతాపం తెలిపారు.


నూర్ అహ్మద్(ఫైల్)

బైక్‌ను ఢీ కొట్టిన ఆటో ..

వెల్దుర్తి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదరాళ్ల గ్రామ సమీపంలో బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల మేరకు.. దాసరదొడ్డి తండాకు చెందిన బోయ సూరి వెల్దుర్తిలో పనిముగించుకొని స్వంగ్రామం దాసరదొడ్డికి బుల్లెట్ బైక్‌పై బయలుదేరాడు. మార్గ మార్గమధ్యలో ఆటో ఢీకొట్టడంతో సూరి కాలు విరగడంతో ప్రైవేటు వాహనంలో వెల్దుర్తి ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం అంబులెన్స్‌లో కర్నూలు సర్వజనవైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ అయ్యస్వామికి స్వల్పగాయాలయ్యాయి.

ఈపోస్ ద్వారా అమ్మాలి

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డీలర్లు రైతులకు ఈపోస్ యంత్రం ద్వారానే ఎరువులు, క్రిమి సంహారక మందులు అమ్మాలని ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఏవో అక్బర్ బాషా సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్ఐ సార్.. మా ఊరి బస్సు రాలేదు

- హొళగుంద పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ముద్దటమాగి విద్యార్థులు
- పోలీస్ వాహనంలో విద్యార్థులను పంపిన ఎస్ఐ గురజాల దిలీప్


ఎస్ఐ దిలీప్ కుమార్‌తో మాట్లాడుతున్న విద్యార్థులు

హొళగుంద, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దటమాగి గ్రామానికి చెందిన 50 మంది విద్యార్థులు తమ ఊరి బస్సు రాలేదని హొళగుంద పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తాము హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నామని, రోజూ బస్సులోనే వెళతామన్నారు. కాగా ఈరోజు బస్సు రాలేదని ఎస్ఐ గురజాల దిలీప్ కుమార్‌కు సమస్యను తెలిపారు. స్పందించిన ఎస్ఐ ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేయగా అరగంటలో వస్తుందని చెప్పగా సాయంత్రం 7గంటల వరకు వేచి చూసినా, రాకపోవడంతో పోలీస్ వాహనంలో విద్యార్థులను వారి గ్రామానికి పంపించారు. దీంతో ఎస్ఐని గ్రామస్థులు అభినందించారు. ఈ విషయంపై డీఎం మహమ్మద్ రఫీని సంప్రదించగా సరైన సమాధానం ఇవ్వలేదు.

లో ఓల్టేజీకి చెక్

దేవనకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో సబ్ స్టేషన్ పరిధిలో లో ఓల్టేజీ సమస్య తీరనుందని విద్యుత్ ఏఈ రవీంద్ర అన్నారు. దేవనకొండ క్రాస్ రోడ్డులోని సబ్ స్టేషన్లో నూతనంగా వచ్చిన 8 మోగా ఓల్ట్ ఆంపియర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని పది గ్రామాల వ్యవసాయబోర్లకు, గృహాలకు, పరిశ్రమలకు ఇక సమస్య ఉండదన్నారు.


దేవనకొండలో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్

కార్యకర్తలకు అండగా టీడీపీ : ఎమ్మెల్యే


చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు, వారి కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. తుగ్గలి మండలం చెన్నంపల్లి కార్యకర్త సుమలత జనవరిలో మృతిచెందింది. ఆమెకు పార్టీ సభ్యత్వం ఉండడంతో ప్రమాదబీమా రూ.10లక్షల చెక్కును మంగళవారం పార్టీ కార్యాలయంలో భర్త రాజశేఖర్ చౌదరి, పిల్లలకు ఎమ్మెల్యే అందజేశారు. జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, నాయకులు ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణను అశ్రద్ధ చేస్తే చర్యలు : డీపీవో


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్

వెల్దుర్తి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణను అశ్రద్ధ చేస్తే చర్యలు తప్పవని డీపీవో భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వెల్దుర్తిలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, వీధుల్లో చెత్తాచెదారం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డీఎంహెచ్‌వో శాంతికళ, మలేరియా అధికారి నూకరాజు, డీఎల్పీవో లక్ష్మీ, తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, ఎంపీడీవో సుహాసినమ్మ, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో సచివాలయంతో ఇబ్బంది


మాట్లాడుతున్న బసవరాజు

హొళగుంద, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోగిలతోట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సచివాలయం నిర్మించడంతో ఇబ్బంది పడుతున్నట్లు పేరెంట్స్ కమిటీ చైర్మన్ బసవరాజు, టీడీపీ కన్వీనర్ వీరన్న గౌడ్, వీరాంజి, రంగప్ప, ద్యావన్న, గోవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో సచివాలయం నిర్మించరాదని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా ఎందుకు స్పందించడం లేదని డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తితో వాగ్వాదానికి దిగారు. పాఠశాలలో 451 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, గదులు సరిపోక అరు బయట కూర్చుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో సచివాలయాన్ని పాఠశాలకు అప్పజెప్పాలని లేనిపక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తి ని వివరణ కోరగా జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

• పాడుబడ్డ భవనం కాదు!



ఈ చిత్రంలో కనిపిస్తున్న పాడుబడ్డ భవనం అనుకుంటే పొరపడినట్లే ఆలూరు మండలం మనెకుర్తి గ్రామీణ పశువైద్యశాల ఇది. ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోక ఇలా తయారైంది. పలుమార్లు ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ కురువ కొల్లమ్మ, టీడీపీ నాయకులు డీలర్ వెంకటేశ్వర్లు, అయ్యాళి, దేవేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

- ఆలూరు రూరల్

అనారోగ్యంతో వైసీపీ నాయకుడి మృతి



నివాళి అర్పిస్తున్న మాజీ సర్పంచ్ రామకోటిరెడ్డి

నందవరం, ఆగస్టు 26(ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో వైసీపీ నాయకుడు దేవపాల్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే కేఆర్ అనుమంతరెడ్డి కుమారులు రాఘవరెడ్డి, ఓంకార్‌రెడ్డి, మనవడుడు మాజీ సర్పంచ్ రామకోటి రెడ్డి, వైసీపీ రైతు విభాగ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, జయరాముడు నివాళి అర్పించారు. అంత్యక్రియల కోసం రామకోటిరెడ్డి రూ.10,000 అందజేశారు. కార్యక్రమంలో శాంతిరాజు, నాయకులు నివాళి అర్పించారు.

వీధి లైట్లకు మరమ్మతులు



రాయచోటిలో మరమ్మతులు చేస్తున్న అధికారులు

నందవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాయచోటి గ్రామంలో వెలగని వీధి దీపాలు, అలాగే విద్యుత్ తీగల మరమ్మతుల పనులను బుధవారం చేపట్టారు. విద్యుత్ స్తంభాలు కూడా ఏర్పాటు చేశారు. దీంతో పాటు పాత విద్యుత్ తీగలను తొలగించి కొత్త తీగలను ఏర్పాటు చేశారు. గ్రామంలో రెండు రోజులకు ఒక సారి విద్యుత్ సమస్య వస్తుండంతో అధికారులు ఏలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ రాయచోటి రామకృష్ణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 59 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాకు హాజరైన యువతీ, యువకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహించారు. మంగళవారం జిల్లా నైపుణ్య అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో హెట్రో ల్యాబ్‌లు, ఎన్ఎస్ పరికరాలు, ఎస్‌బీఐ కార్డులు, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, పుష్కల్ ఆగ్రో టెక్ లిమిటెడ్ తదితర కంపెనీలు పాల్గొన్నాయి. ఈ జాబ్ మేళాకు 155 మంది నిరుద్యోగులు హాజరవగా వీరిలో 59 మంది నిరుద్యోగులు వివిధ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10వేల నుంచి రూ 24 వేలు జీతం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీప్రసాద్, కళాశాల సిబ్బంది, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయితేజ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిక్షయ మిత్రులకు సర్టిఫికెట్లు ప్రదానం



నిక్షయ మిత్రులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్యులు

పెద్దకడబూరు , ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద టీబీముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 15 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఐదు నెలల పాటు పోషకాహార కిట్లను ఇచ్చిన దాతలకు నిక్షయమిత్ర సర్టిఫికెట్లను ఎంవోటీసీ వైద్యులు శేఖన్‌బాను, మెడికల్ అధికారి డాక్టర్ ఫిర్దోస్, కేజియా, రవికుమార్, సుస్మితలు అందజేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ దాతలు మరో ఐదు మంది పేద క్షయవ్యాధిగ్రాస్తులకు కూడా పోషకాహార కిట్లు ఇచ్చేందుకు ముందుకు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. వ్యాధి నిర్ధారణఅయిన ప్రతిఒక్కరికి ఉచితంగా మందులతో పాటు నెలకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఆదినారాయణ, శ్రీధర్, సుశీల, భాస్కర్, బాబురాజు లు పాల్గొన్నారు.

కనకవీడులో యూరియా పంపిణీ



రైతులకు యూరియాను అందజేస్తున్న నాయకులు

నందవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకవీడ గ్రామంలో బుధవారం రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు డబ్బా ఈరన్న, అధికారులు మాట్లాడుతూ పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు 3 సంచుల ప్రకారం యూరియాను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



పూజలకు వేళాయె

● వాడవాడలో కొలువుదీరనున్న గణనాథుడు

● పూజా సామగ్రి, పూలు, పండ్లకు పెరిగిన డిమాండ్

ఎమ్మిగనూరు,ఆగస్టు 26(ఆంధ్ర జ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వినాయక మండపాలను విద్యుత్ దీపాలు, జెండాలతో అందంగా అలంకరించారు. బుధవారం ఉదయం మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠ చేసేందుకు సిద్ధం చేశారు. శుక్రవారం నిమజ్జనం చేపడుతున్నట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా వినాయక చవితిని పురస్కరించుకొని పూలు, పండ్లుకు గిరాకీ ఏర్పడింది. పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. చిన్నచిన్న మట్టి వినాయక విగ్రహాలతో పాటు ఇతర వినాయక విగ్రహాలను పట్టణలోని సోమప్ప సర్కిల్‌లో ఉంచారు. విగ్రహాలతో పాటు పూజా సామగ్రి, పూలు, వివిధ రకాలు పండ్లు, చెరుకులు, అరటి మొక్కలు వాటిని కొనేందుకు జనం సర్కిల్‌లో రావటంతో సోమప్ప సర్కిల్ జనం కిట కిటలాడింది. కొన్ని చోట్ల మండపాలను వినూత్న రీతిలో తయారు చేశారు.



పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు



వినాయక విగ్రహంతో బాలవినాయక మండలి నిర్వాహకులు



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న పీఠాధిపతి

మట్టి విగ్రహాలను పూజిద్దాం

● పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

● మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

మంత్రాలయం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. మంగళవారం స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో మంచాలమ్మ పూజారిగా పని చేస్తున్న రాఘవేంద్రగౌడు ఏర్పాటుచేసిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీకి పీఠాధిపతి ముఖ్యఅతిథిగాపాల్గొని మాట్లాడారు. మట్టి విగ్రహాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పర్యావరణ పరిరక్షణ కాపాడేందుకు వివిధ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటివి వాడకుండా మట్టి గణపతులకే పూజలు చేసి నిమజ్జనం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వందలాది మంది గ్రామస్థులకు, భక్తులకు ఉచితంగా మట్ట విగ్రహాలను పీఠాధిపతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాఘవేంద్రగౌడు, చంద్రశేఖర్‌గౌడు, తంబి స్వామి, రాఘవేంద్రరావు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకోవాలి

● యువజన గణేశ్ ఉత్సవ కమిటీలతో సమావేశం

మంత్రాలయం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకుందామని మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ అన్నారు. మంగళవారం సాయంత్రం మంత్రాలయం పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెద్ద ఎత్తున డీజేలు, మద్యం, అల్లర్లతో కూడిన ఆటపాటలు, భక్తులపై రంగులు వేయడం వంటివి నిషేధంలో ఉన్నాయని తెలిపారు. నిర్లక్ష్యం వహించకుండా పోలీసులకు సహకరించాలని, గణేశ్ నిమజ్జనంలో ఘర్షణలు జరిగినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గణేశ్ మండపాల వద్ద రాత్రి సమయాల్లో నిర్వాహకులు కాపలా ఉండాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీలపైనే ఉంటుందని, నిమజ్జనం రోజు పోలీసులకు సహకరించి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్

మార్కెట్ కమిటీలో టార్పాలిన్ల కొరత

● ఇబ్బందులు పడుతున్నరైతులు

● పట్టించుకోని అధికారులు

ఎమ్మిగనూరు,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో టార్పాలిన్ల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌కు పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, కృష్ణగిరి, దేవనకొండ మండలాలతో పాటు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి రైతులు వేరుశనగను తీసుకొస్తున్నారు. మార్కెట్ వేరుశనగను రాసులు పోసి టెండర్‌కు సిద్ధం చేసిన సమయంలో ఉన్నట్లుండి వర్షం వస్తే రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మంగళవారం మార్కెట్‌కు దాదాపు 13,977 బస్తాల వేరుశనగ, 195 బస్తాలు ఆముదాలు అమ్మకానికి వచ్చాయి. అయితే మధ్యాహ్నం చిన్నపాటి వర్షం కురిసింది. సరుకు తీసుకునేందుకు కొనుగోలుదారులు కొంతసేపు తిరకాసు పెట్టారు. టెండరు ఫారం వచ్చిన వెంటనే ఖాళీ సంచులు రాకపోవటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే కొనుగోలు దారులు, కమీషన్ ఏజెంట్లు మార్కెట్ కార్యదర్శిని కలిసి మాట్లాడారు. కాటా పట్టిన తరువాత బస్తాలు తడవకుండా లోడింగ్ చేయించాలని బయ్యర్లు, మార్కెట్ కార్యదర్శి సూచించటంతో సమస్య సద్దుమణిగింది. కాగా మార్కెట్‌లో కేవలం 40 టార్పాలిన్లు మాత్రమే ఉన్నాయి. పెద్దవర్షం వచ్చిన సమయంలో పంట రైతులు ఇబ్బందులు పడాల్సివస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వేరుశనగ రాశిపై ఖాళీ సంచులు కప్పిన దృశ్యం

టార్పాలిన్ల కోసం ప్రతిపాదనలు పంపాం

మార్కెట్‌లో రైతులకు అందుబాటులో 40వరకు టార్పాలిన్లు ఉన్నాయి. మరో 100 టార్పాలిన్ల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు దారులు, కమీషన్ ఏజంట్లతో మాట్లాడి సరుకును కాటా పట్టేందుకు చర్యలు తీసుకున్నాం.

● చంద్రమౌళి, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి, ఎమ్మిగనూరు

విద్యుత్ కార్మికులను వేధిస్తే సహించం

ఎమ్మిగనూరు,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికులను, సిబ్బందిని వేధిస్తే సహించమని విద్యుత్ ఏపీఎస్‌పీఈ జేఏసీ నాయకులు లక్ష్మణ్ణ, జగదీష్, నాగ శేషు, జగ్గయ్యనాయక్, రుద్రప్ప, సుబ్రహ్మణ్యం, రమేష్ అన్నారు. విద్యుత్ కార్మికులపై వేధింపులను మానుకోవాలని మంగళవారం విద్యుత్ కార్యాలయం ముందు విద్యుత్ కార్మికులు మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆదోని, పత్తికొండ, ఆలూరు, గూడూరు, మంత్రాలయం ఎమ్మిగనూరు ప్రాంతాల నుంచి కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ విద్యుత్ శాఖలోని ఉన్నతాధికారులు చిన్న చిన్న కారణం చూపుతూ మెమోలు ఇవ్వడం, ప్రకృతి వైపరిత్యాలు జరిగినప్పుడు కార్మికులను బాధ్యులుగా చేసి సస్పెండ్ చేయడం, మండలం, గ్రామాల్లో ఉండడం లేదని హెచ్ఆర్ఏను నిలిపివేయడం వంటివి చేస్తు కార్మికులను అడుగడుగునా మానసికంగా వేధిస్తున్నారన్నారు. ఏఈ స్థాయి వరకు ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నారే తప్ప దిగువ స్థాయిలో ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న కార్మికులపై పనిభారం మోపుతున్నారని మండిపడ్డారు. అనంతరం డిమాండ్లతో కూడిన ఈఈ శాంతిస్వరూప్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాయచోటి స్వామి, పురుషోత్తం రెడ్డి, శివ, చిరంజీవి, రసూల్,అనిల్ కుమార్, పాండురంగా రెడ్డి, రత్నకుమార్, విజయ్‌లు పాల్గొన్నారు. కాగా మహాధర్న సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాసులు అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మదర్ థెరిస్సా దేశానికి చేసిన సేవలు మరువలేనివని పూలే అంబేడ్కర్ సొసైటీ అల్ఫ్రెడ్ రాజు, వేదాస్ స్వచ్ఛంద సంస్థ సునీల్ కుమార్ అన్నారు. పట్టణంలో మదర్‌థెరిస్సా జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు ప్రతి ఒక్కరూ మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకొని ఇతరులకు సహాయం చేసి మానవత్వాన్ని చాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాచాని వేంకటేష్, భారతి, నాగరాజు, లక్ష్మన్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృమూర్తి మధర్‌థెరిస్సా జయంతిని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం అంపయ్య, జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ మానవసేవయే మాదవసేవ యని కుష్టు, గుడ్డి, వికలాంగులు, అనాథలను చేరదీసి తన జీవితాన్నే త్యాగం చేసిన మదర్ థెరిస్సా సేవలు మరువలేనివని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వితోభరావు, గోట్ల చంద్రశేఖర్, ఈరన్న, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర, ప్రకాష్, తిక్కయ్య పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మదర్ థెరిస్సాకు నివాళి అర్పిస్తున్న అల్ఫ్రెడ్ రాజు, నరసన్న, కామశే గణేష్



మధర్ థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

కడివెళ్ల గ్రామంలో కార్డన్‌సెర్చ్



రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేస్తున్న డీఎస్పీ

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివెళ్ల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ భార్గవి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున 4గంటలకే గ్రామంలోని అనుమానాస్పద ఇళ్లల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని బోయ కేశన్న ఇంట్లో 40 అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటీళ్లు లభ్యమయ్యాయి. దీంతో కేశన్నను అదుపులోకి తీసుకొని మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అనంతరం డీఎస్పీ భార్గవి గ్రామ ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎవరైనా చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు రూరల్, కోసిగి, మంత్రాలయం, గోనెగండ్ల సీఐలు బీవీ మధుసుదన్‌రావు, మంజునాథ్, రామానుజుల్, భాస్కర్, ఎస్ఐలు శ్రీనివాసులు, మధుసుదన్, కేశవ్, శివాంజల్, నిరంజన్‌రెడ్డి, ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీవోను రద్దు చేయాలి: పీడీఎస్‌యూ

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యా స్వేచ్ఛను హరించే విద్యాశాఖ జీవోను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు విడుదల చేసినటువంటి నూతన జీవోలో పాఠశాల లోపలికి యాజమాన్యం కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మినహా ఇతరులను అనుమతించరాదని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను విద్యార్థి స్వేచ్ఛను ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని అన్నారు. జీవోను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యువరాజు, మహేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువకుడి బలవన్మరణం

మంత్రాలయం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కురువ వెంకటరాముడు(24) అనే వ్యక్తి పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడినట్లు మాధవరం హెడ్‌కానిస్టేబుల్ రాముడు తెలిపారు. మృతుడు మద్యానికి బానిసై సోమవారం తెల్లవారుజామున ఇంటిలో ఉన్న పురుగుల మందు సేవించాడు. ఇది గమనించిన స్థానికులు ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి హనుమంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలి: ఆర్ఏవీఎఫ్



మట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకలు

ఎమ్మిగనూరు,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని ఆర్ఏవీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కరువు, వలసలకు నిలయమైన మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజవర్గాలతో ఆదోని డివిజన్‌ను కొత్త జిల్లాగా చేయాలని కోరారు. పార్టీలకు అతీతంగా రాజకీయ పార్టీల నాయకులు ఆదోని జిల్లాకై గళం విప్పాలన్నారు. సమావేశంలో నాయకులు వీరేష్, మోహన్, రవీంద్ర, రాజు నాయక్, మహబూబ్ పాల్గొన్నారు.